క్లుప్తంగా

332 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య నిపుణులు

పరవాడ: విశాఖ స్టీల్‌సిటీ లయన్స్ క్లబ్ సేవలను పరవాడ ప్రాంతంలోని అన్ని పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్టీల్ సిటీ లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ శివకోటి శ్రీనివాసరావు అన్నారు. లయన్స్ క్లబ్ విశాఖ ఐ ఆస్పత్రి సహకారంతో స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన 332 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపి, 12 మందికి కళ్లద్దాలు అమర్చాల్సి ఉందని గుర్తించారు. వీరికి త్వరలో కళ్లద్దాలను అందిస్తామని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ చైర్మన్ ఎస్.ఎం.వి.సత్యనారాయణ, లయన్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంత్రి జగన్నాథరావు, క్లబ్ కార్యదర్శి సత్యప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు



ఎస్వీ అంబేడ్కర్, తహసీల్దార్, పరవాడ

పరవాడ: మండలంలో ఈ నెల 6(శుక్రవారం) నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఈ నెల 6న రావాడ, 7న లంకెలపాలెం, 11న మంత్రిపాలెం, 13న దేశపాత్రునిపాలెం, 17న తాడి, 18న స్వయంభూవరం, 19న చీపురుపల్లి(వెస్ట్), 20న చీపురుపల్లి(ఈస్ట్), 24న కలపాక, 26న తానాం, 27న పరవాడ, వెన్నలపాలెం, 31న కన్నూరు, జనవరి 2న పెంటచీమ బోనంగి, 3న పాయకరావు బోనంగి, 4న భర్నికం, 5న ఈదులపాక బోనంగి, 7న ఇ.మర్రిపాలెం, 8న పెదముషిడివాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ గురువారం మీడియాకు తెలిపారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు ఈ రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. రెవెన్యూ సదస్సులను ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామాల వారీ రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. గతంలో వైఎస్సార్-జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే జరిగిన గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇప్పుడు గ్రామ పరిధిలోని రెవెన్యూ సంబంధిత అన్ని అంశాలపై సదస్సులు నిర్వహించనున్నారు. దీన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ కోరారు.

ఎస్‌బీఐ వినియోగదారునికి బీమా నగదు అందజేత



చెక్ అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

పెందుర్తి: రాంపురం ఎస్‌బీఐ బ్రాంచ్ వినియోగదారుడి కుటుంబానికి రూ.4 లక్షల బీమా నగదు మంజూరైంది. గ్రామానికి చెందిన జామి గౌరునాయుడు బ్యాంక్‌లో ప్రమాద బీమా ప్రీమియం రూ.200 చెల్లించాడు. ఈ ఏడాది మే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆయనకు రూ.4 లక్షల బీమా మంజూరైంది. గురువారం బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో నామిని జామి నాగమణికి చెక్‌ను ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అభిషేక్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్బవరం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రం



అపార్‌మైన కష్టాలకు ఆధార్‌ం

దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ఇకపై ఆధార్ తరహాలో అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ రిజిస్ట్రీ) గుర్తింపు కార్డు అందుబాటులోకి రానుంది. 'వన్ నేషన్- వన్ ఐడీ'పేరిట 17 అంకెలుండే కార్డుల మంజూరుకు కేంద్రం ఆదేశాలు చేసింది. దీంతో మండలంలో కూడా ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఆధార్ కార్డులో వివరాలకు, స్కూల్ రికార్డులకు పొంతన లేకపోవడంతో అపార్ నమోదు కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అపార్ నమోదుకు విద్యార్థులు, తల్లిదండ్రుల తిప్పలు
- ఆధార్ కార్డులో పొరపాట్ల సవరణకు అవస్థలు
- పనులు మానుకుని పడిగాపులు కాస్తున్న వైనం

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వ **నూతన విద్యా విధానం**లో భాగంగా దేశంలోని ప్రతి **విద్యార్థికి ఒక విశిష్ట** గుర్తింపు నెంబర్ ఉండేలా అపార్‌ను తీసుకొచ్చింది. ఆధార్‌తో అనుసంధానించిన 'అపార్'సంఖ్యను నమోదుచేస్తే చాలు.. విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల సర్టిఫికెట్లు తదితర అన్ని వివరాలూ తెలుసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అపార్ వివరాల నమోదు మొదలయింది. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు విద్యా సంస్థల్లో విద్యార్థుల వివరాలకు, ఆధార్ కార్డులో ఉన్న వివరాలు సరిపోలట్లేదు. ఎక్కువగా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లలో పొరపాట్లున్నాయి. వీటిని ఆధార్‌లో సవరిస్తే తప్ప అపార్‌లో నమోదుకు వీలుకాని పరిస్థితి.

పొంతనలేని రికార్డులు

ప్రస్తుతం అపార్ రిజిస్ట్రేషన్ మండలంలో చురుగ్గా సాగుతోంది. చాలా మంది విద్యార్థుల వివరాలు స్కూల్ రికార్డులతో మ్యాచ్ కావట్లేదు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులున్న పిల్లల స్కూల్ రికార్డులు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ తదితర ధ్రువీకరణ పత్రాల్లో ఒకదానితో ఒకటి పొంతనలేకుండా వివరాలున్నాయి. చాలా వరకు ఆధార్ కార్డే ప్రధాన ఆధారం కావడంతో.. దాన్ని పరిగణనలోకి తీసుకుందామన్నా.. వివరాలు సరిపోలక అపార్ నమోదు కావట్లేదు. ఇప్పటికే పలువురు విద్యార్థుల స్కూల్ రికార్డుల్లోని తప్పులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సవరిస్తున్నారు. ఆధార్ కార్డుల్లో తప్పులను సరిచేసేందుకు మండలంలోని విద్యాలయాల్లో రోజుకు రెండు చోట్ల ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఆధార్ కేంద్రాల వద్ద అవస్థలు

ప్రస్తుతం మండలంలో టెన్త్ వరకు విద్యార్థుల అపార్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇంటర్ విద్యార్థుల నమోదు ఈ మధ్యనే ప్రారంభమైంది. ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించింది. ఇక్కడ భారీ సంఖ్యలో జనాలు పోటెత్తడంతో ప్రక్రియ నత్తనడకగా సాగుతోంది. టోకెన్లు ఇచ్చి మరీ తర్వాత రమ్మని చెప్తున్నారు. మరోవైపు పుట్టిన తేదీ సవరణకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి. దీంతో తల్లిదండ్రులు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, జీవీఎంసీ జోన్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

17 అంకెలతో విశిష్ట నంబర్

అపార్ కార్డుతో దేశంలోని కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థుల సమగ్ర వివరాలు ఒకే దగ్గర పొందుపరుస్తోంది. విద్యార్థి ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని వివరాలూ ఇందులో నిక్షిప్తం చేస్తారు. ఈ కొత్త కార్డును ఆధార్ సంఖ్యతోపాటు 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ)'అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానిస్తారు. ఈ 17 అంకెల అపార్ నంబరే విద్యార్థి శాశ్వత ఐడీగా పరిగణిస్తారు. దీంట్లో విద్యార్థి అకడమిక్ వివరాలు, పరీక్షల్లో పొందిన మార్కులు, విద్యా ప్రయాణం అన్నీ నమోదు చేస్తారు. భవిష్యత్తులో ప్రవేశ పరీక్షల దరఖాస్తుల్లోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే వివరాలన్నీ ఆటోమేటిగ్గా ఫిల్ అయిపోతాయి.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మండలంలోని విద్యా సంస్థలు

ప్రభుత్వ పాఠశాలలు	51
ప్రైవేట్ పాఠశాలలు	22
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	01
ప్రైవేట్ జూనియర్ కాలేజీలు	02
ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు	10,494 మంది
అపార్ పూర్తయిన విద్యార్థుల శాతం	77.98 శాతం

కొనసాగుతున్న నమోదు



మా స్కూల్లో 559 మంది విద్యార్థులున్నారు. అపార్ నమోదును ముందుగా టెన్త్ విద్యార్థులతో మొదలెట్టాం. ఇప్పటి వరకు 425(76 శాతం) మంది విద్యార్థుల అపార్ నమోదు పూర్తయింది. మరో 134(24 శాతం) మంది విద్యార్థులు మిగిలిపోయారు. వీరంతా జనన ధ్రువీకరణ పత్రాలు, వ్యక్తిగత వివరాల్లో ఇంటి పేర్ల వంటి తప్పిదాల వల్ల నమోదు చేయలేకపోయాం. వీరంతా ఆధార్ సేవా కేంద్రాలకు వెళ్లి వాటిని సరిచేయించుకుని వస్తున్నారు.

– **తిరుపతిరావు**, హెచ్ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం

ఆధార్ సేవా కేంద్రాల ఏర్పాటు



మండలంలో అపార్ నమోదు వేగంగా సాగుతోంది. ప్రైమరీ నుంచి టెన్త్ వరకూ విద్యార్థుల్లో 78 శాతం నమోదు పూర్తయింది. ఇంటర్ విద్యార్థుల అపార్ నమోదు ఈ మధ్యనే ప్రారంభం కావడంతో కొంత వెనుకబడి ఉంది. అపార్ నమోదుకు విద్యార్థుల ఆధార్ వివరాల్లో పొరపాట్లు కొంత అవరోధంగా మారుతున్నాయి. దీంతో మండలంలోని విద్యార్థులంతా సరిచేసుకునేలా రోజుకు రెండు విద్యా సంస్థల్లో ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

– **లక్ష్మణరావు**, మండల విద్యాశాఖాధికారి, సబ్బవరం

అంగరంగ వైభవంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

పరవాడ: వెన్నలపాలెం గ్రామ ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి పండగ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. బండారు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు వేకువ జాము నుంచే ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. గ్రామ పెద్దలు ఏకుల అప్పారావు, వెన్నల వెంకినాయుడు, రెడ్డి నాయుడు, వెన్నల నరసింహరావు, వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, పైల సన్యాసిరావు, అభినాయుడు, మాసవరపు నరసింగరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేసి, మంచినీటి సదుపాయం కల్పించారు. అమ్మవారి అనుపు మహోత్సవంలో భాగంగా రాత్రి అమ్మవారిని గ్రామ పుర వీధుల్లో డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. భారీ బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'పాలిటెక్నిక్ టెక్ ఫెస్ట్'లో పెందుర్తి విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న తుమ్మిడి చారిటబుల్ ట్రస్ట్ అధినేత రామ్‌కుమార్

పెందుర్తి: నగరంలో జరిగిన జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాల 'పాలిటెక్నిక్ టెక్ ఫెస్ట్-2024'లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'లాట్-డ్రివెన్ స్మార్ట్ స్కూల్ బస్ ట్రాకింగ్, అటెండెన్స్ సిస్టం' ప్రాజెక్ట్‌తో ఎస్.వి.ఎస్.తరుణ్‌కుమార్, టి.దివ్యకీర్తి, పి.స్రవంతి, ఎస్.బాలవిశ్వనాథం తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి తుమ్మిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మిడి రామ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ గైడ్ జయలక్ష్మి, హెచ్‌వోడీ నాగమణి పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు

పరవాడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు పర్యవేక్షణ జరిపి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రగతిని తెలుసుకుని, వాటిని వేగంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను నేరుగా తనకు లేదా ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో డి.ఎస్.శ్యామ్‌సుందర్, ఎమ్మార్వో అంబేడ్కర్, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

స్వర్ణ కవచాలంకరణలో స్వామి దర్శనం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు గురువారం స్వామివారు స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

విశేషంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వేడుకగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. దీంతో పరవాడ, వెన్నలపాలెం, బొద్దపువానిపాలెం, రావాడ, భర్నికం, స్వయంభూవరం, గొర్లి వానిపాలెం, బోనంగి, గొల్లలపాలెం, కలపాక, ఇ.బోనంగి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ట




అమ్మవార్ల సన్నిధిలో మొక్కుకుంటున్న ధర్మకర్త అచ్చింనాయుడు

సబ్బవరం: సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, సరస్వతి, నాగబంధ విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేదపారాయణం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్య ప్రాశన, ప్రతిష్ఠా సంకలనం, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పసిడి కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ధేను దర్శన అనంతరం మంగళ నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు, ఎంపీటీసీ చైతన్య, గ్రామ పెద్దలు ఉమామహేశ్వరరావు, గండి దేముడు, గొంప సత్యనారాయణ, బాదిరెడ్డి లక్ష్మణ, త్రిమూర్తులు, శివ, నీలేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.

పరవాడ సబ్ డివిజన్ కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు



ఎస్పీ తుహిన్ సిన్హాకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ సత్యనారాయణ



పరవాడ సబ్‌డివిజన్ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

పరవాడ: మహిళలు, చిన్నారులు, వృద్ధులసమస్యలపై సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పరవాడ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎస్పీ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులను సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సబ్‌డివిజన్ పరిధిలో జరిగే తీవ్రమైన కేసులపై ఆరా తీశారు. ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల్లో విచారణ వేగవంతం చేసి, త్వరితగతిన కోర్టుకు నివేదించేలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగించేలా సదస్సులు నిర్వహించాలన్నారు. బ్యాంకులు, ఏటీఎంలు, ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణ, రవాణా జరిగే మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు తరచూ చేపట్టాలన్నారు. రోడ్డు భద్రత నియమాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సబ్‌డివిజన్‌లో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ఏఎంహెచ్‌వోను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ పూర్తిగా, స్వచ్ఛందంగా విడనాడాలని జీవీఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సే నో టు ప్లాస్టిక్' నినాదానికి కట్టుబడి నగరంలో ఎవరూ ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలను వివరించారు. శానిటరీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం జీవనంలో భాగం కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రాండ్ మాస్టర్లు



పాల్గొన్న ధ్యాన మాస్టర్లు, ధ్యానులు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని ధ్యాన గ్రాండ్ మాస్టర్లు సత్యవతి, పద్మకుమారి అన్నారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం ధ్యానంపై 'ధ్యాని, విజ్ఞాని'అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ధ్యానం మానసిక ఒత్తిళ్లను జయించేలా చేస్తుందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో వివరించారు. ధ్యాన కేంద్ర నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత ప్రతిభ విద్యాలయం



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ రమణ

సబ్బవరం: ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్ ప్రతిభ కప్ పోటీల్లో స్థానిక ప్రతిభ విద్యాలయం జట్టు విజేతగా నిలిచింది. ప్రతిభ విద్యాలయంలో హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని 10 పాఠశాలల నుంచి 10 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్లో ప్రతిభ విద్యాలయం జట్టు, విశాఖలోని సెయింట్ అలోసిస్ జట్టుపై నెగ్గి, కప్ అందుకుంది. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన టీం సభ్యులను స్థానిక తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ పిన్నింటి రమణలు అభినందించారు. వారికి ట్రోఫీలతో పాటు రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణరావు, స్కూల్ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, డైరెక్టర్లు శరత్‌తేజ, శ్రీవిష్ణుతేజ, హెచ్ఎం కె.కనకమహాలక్ష్మి పీడీలు పాల్గొన్నారు.